

# ఆక్రందన

జ్యోత్స్న-ఇలియాస్

న్యూఢిల్లీ రైల్వే స్టేషన్... ఉదయం 4 గం 45ని.... క్యాంటీన్లో వేడి వేడి చాయ్ తాగి, స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ వెలిగించాడు రమణారావు. మోకాళ్ళకిందవరకూ ఉలెన్ ఓవర్‌కోటూ-చేతులకి గ్లోవ్స్ ఉన్నా, అతనిచేతులు చలికి కొద్దిగా వణుకుతున్నాయి ఎక్స్‌ప్రెస్ బయలుదేరడానికి ఇంకా అరగంటుంది. నెమ్మదిగా, తనకంపార్ట్‌మెంట్ కేసి బయలుదేరాడు రమణారావు. అంతలో, సన్నగా, పొడుగ్గా ఉన్న ఒకఅమ్మాయి గబగబా ట్రైన్ కేసి వెళ్ళడం చూసి ఒక్క క్షణం అక్కడే నిలబడి పోయాడు... నీరజ!

నీరజ ఢిల్లీలో ఏంచేస్తోంది! అసలది నీరజేనా? పేరుపెట్టి పిలవచ్చు కానీ, అది నీరజ కాకపోతే బావుండదు. అతను వడివడిగా అమ్మాయి దగ్గరికి చేరుకుని, 'ఎక్స్‌క్యూజ్ మీ" అన్నాడు.

ఆ అమ్మాయి ఉలిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది.

తన ఎదురుగా నిలబడి వున్నది నీరజేనన్న సంగతి రమణరావుకి ధృవపడిపోయింది.. ఇలా అనుకోకుండా ఇన్నేళ్ళతరువాత కలుసుకోవడం అతని

కెంతో ఆనందంగా వుంది. కాలేజీలో తనని ఉక్కిరి బిక్కిరి చేసిన తన క్లాస్ మేట్ నీరేజనా ఇది! కానీ, ఆమె కళ్ళలో ఆ బెదురేమిటి? తనని చూసి ఎంతో ఎక్సైటెట్ అవుతుందనుకున్నాడు కానీ నీరజ అతన్ని గుర్తు కూడా పట్టి నట్టు లేదు. అతనికిదంతా అయోమయంగా వుంది.

'నీరజా! నేను....రమణారావుని'.. అన్నాడు మరింకేమనాలో తెలియక.

"ఆఁ" ?! నీరజ తన నింకా గుర్తు పట్టలేదు. ఆమె కళ్ళలోని బెదురు అలాగే వున్నది. అతని భుజం మీదుగా వెనక ఎవరున్నారా అన్నట్టు చూస్తోంది....నీరజ కేమైంది? ఎవరో తనని తరుము కొస్తున్నట్లు ఏమిటా చూపులు?

"ఎవరికోసం చూస్తున్నావు నీరజా? ఇంకెవరైనా రావాలా? కెన్ ఐ హెల్ప్ యూ?....అసలింతకీ నన్ను గుర్తు పట్టావా లేదా?" -నీరజ మొహంలోకి చూస్తూ అడిగాడు.

'హైనాట్ రమణారావ్' అంది నీరజ అతనికేసి చూడకుండా. నీరజ సమాధానం అతన్ని సంతృప్తి పరచ లేదు ఏదైనా పెద్ద సమస్యలో ఇరుక్కుందా తను? మరి కాకపోతే ఏమిటి? కాలేజీలో తను పలకరించక పోయినా; గంటల తరబడి తనతో మాట్లాడుతూ వుండేది. తన ఫ్రెండ్స్‌తో వచ్చి తనని ఆటలు పట్టించి ఎగతాళి చేస్తుండేది. అటువంటి నీరజ ఇప్పుడు తననెలా వదలించుకోవాలా అన్నట్టు అంటీ ముట్టకుండా ముక్తసరిగా జవాబు చెప్తోంది.

''ఫర్వాలేదు, చెప్పు నీరజా. అసలు సంగతే



మిటి? ఎందుకలా వున్నావు అసలు ఢిల్లీ ఎప్పుడొచ్చావు?"

"ఢిల్లీకా... ?గుర్తు లేదు. చాలా రోజులై వుండాలి. కానీ వెంటనే హైద్రాబాద్ వెళ్ళాలి....కానీ అతను నన్ను వదిలి పెట్టడు నేను ఎక్కడికి వెళ్ళినా నన్ను వెంటాడ్తాడు. మళ్ళీ అతనికి పట్టుబడి పోతానేమో!"

"ఎవరు నీరజా? నిన్నెవరన్నా వెంటాడుతున్నారా, చెప్పు" ఆతృతగా అడిగి అప్రయత్నంగా వెనక్కి తిరిగి జనంలోకి చూసాడు.

''ఇంకెవరూ? సుధీర్! నన్ను సర్వనాశనం చేసికాని ఊరుకోడు. ఎవరూ నన్ను అతన్నుంచి రక్షించలేరు''... ఆగి ఆగి మాట్లాడ్తోంది నీరజ, ఏదో పెద్ద షాక్ తినుండాలి, ప్రపంచంలో తనకి ఎవరూ లేనట్టు మాట్లాడ్తోంది.

వాళ్ళ నాన్నగారు హైదరాబాద్‌లో పేరూ పలుకుబడీ వున్న బిజినెస్ మాన్. ఆయనుండగా ఇంక నీరజకు సమస్య ఏమిటి?

"అసలు సంగతేమిటి నీరజా! నాన్నగారెక్కడున్నారిప్పుడు?"

"అదేమిటి నీకు తెలియదా?.... నాన్నగారు చనిపోయారు"

"నాన్నగారుపోయారా? ...ఐయామ్ సారీ....కానీ ఎలా?"

"అది కూడా సుధీర్ చేసిన పనే.. స్లో పాయిజనింగ్ చేశాడు ..నాకు తెలుసు.... ఈ విషయం ఎవరికి చెప్పినా నమ్మరు.... నేను చెప్పేది ఎవరూ నమ్మరు....నన్ను కూడా అతను చంపేస్తాడు ..."

పరిస్థితి మరీ ఇంత దారుణంగా వుంటుందనుకోలేదు రమణారావు.

"నీ బెర్త్ ఏ కంపార్ట్‌మెంటులో వుంది?" అడిగాడతను అయోమయంగా చూసి. అంతవరకూ గుప్పెట్లో పెట్టుకున్న టికెట్టు రమణారావు చేతిలో పెట్టింది నీరజ హైదరాబాద్‌కి సెకండ్ క్లాస్ టికెట్టు.

"అరె నీకు రిజర్వేషన్ లేదా? సెకండ్‌క్లాస్‌లో హైదరాబాద్ ఎలా వెడతావు?"

"ఎలాగైనా నేను హైద్రాబాద్ చేరుకోవాలి, లేకపోతే నన్ను.... నన్ను... అయామ్ ఇన్ మోర్టల్ డేంజర్"

"నో నీరజా. నువ్విలా వెళ్ళడానికి వీల్లేదు .... చూడు, నన్ను నమ్ముతావు కదా?" అవునన్నట్టు నెమ్మదిగా తలూపింది నీరజ

"అయితే విను. ఇప్పుడు మనమీ ట్రైన్‌లో వెళ్ళొద్దు. టికెట్లు కాన్సిలు చేసుకుని రిజర్వేషన్ చేయించుకుని వెళ్దాం, లేకపోతే నిన్ను ఫ్లయిట్‌లో తీసుకెడతాను. నిన్ను హైద్రాబాద్ చేర్చే పూచీనాది ఒకే? అంతేకాదు నీ సమస్యల్ని నేను పరిష్కరిస్తాను, వివరాలు చెప్తే పోలీస్‌కంప్లయింట్ ఇద్దాం పద" నా లగేజ్ తెచ్చుకుంటాను...." అంటూ తన కంపార్ట్‌మెంట్ కేసి వెళ్ళబోయాడు రమణారావు. నీరజ వెళ్ళవద్దన్నట్టు అతని చేయి పట్టుకుని ఆపేసింది.

"వద్దు .... నేనిప్పుడు బయటికి రాను.... అతను నా టాక్సీని వెంటాడుతూ వచ్చాడు. నాకోసం ప్లాట్‌ఫారం అంతా గాలిస్తూ వుంటాడు, నేను .... నేను వెళ్ళాలి .... ఈ ట్రైన్‌లోనే వెళ్ళిపోవాలి .... నువ్వే నన్ను కాపాడాలి.... కాపాడాలి .... ప్లీజ్ నాకు ఎలాగైనా ఒకసీట్ ఇప్పించు. నువ్వు నా ఫ్రెండ్‌వి కదా .... ఆ మాత్రం చేయలేవా?" నీరజ గబగబా మాట్లాడుతూ భయంగా అటూ ఇటూ చూస్తోంది.

"నీరజా ... నాతోరా అంటూ తన కంపార్ట్‌మెంటుకేసి దారితీశాడు రమణారావు. నీరజని కంపార్ట్‌మెంట్లో కూర్చోపెట్టి వెళ్ళి టి.టి.ఇ.తో అయిదు నిముషాలు మాట్లాడి వచ్చాడు,

"హమ్మయ్య .... ఇంతవరకూ మనం లక్కీ నీరజా! ఈ బెర్తు ఝాన్సీ వరకూ ఖాళీయేనట.... అక్కడికి చేరిన తరువాత ఏంచేయాలో తరువాత ఆలోచిద్దాం. మన అదృష్టం బావుంటే హైదరాబాద్‌వరకూ రిజర్వేషన్ దొరికినా దొరకొచ్చు. లేకపోతే ఝాన్సీలో మనం

దిగిపోయి మరో ట్రైన్ ఏదైనా ఎక్కుదాం...." ఎంతో హుషారుగా చెపుతున్నా రమణారావుకి నీరజ మౌనం నిరుత్సాహం కలిగించింది. కిటికీకి తలానించుకుని కాళ్ళు బెర్త్ మీద ముడుచుకుని ప్రతిమలా కూర్చుంది నీరజ. ట్రైన్ కదిలితేకానీ తనభయం తగ్గదేమో.

ఆసలు తనని వెంటాడుతున్న ఆ సుధీర్ ఎవరో .... మరోసారి అనుకున్నాడు రమణారావు

ట్రైన్ కదిలి వేగంగా న్యూఢిల్లీ స్టేషన్‌లోంచి బయటకి వచ్చింది. రమణారావు తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు

"నౌ యు కెన్ రిలాక్స్ నీరజా. ఇప్పుడు నిన్నెవ్వరూ ఏమీ చెయ్యలేరు"

నీరజ వెంటనే ఏమీ మాట్లాడలేదు డైనింగ్ కార్ సప్లయర్ తెచ్చిన బ్రేక్ ఫాస్ట్ తింటూ నీరజని మాటల్లో పెట్టాలని ప్రయత్నించాడు రమణారావు.

నీరజ పూర్తిగా రిలాక్స్ అయితే గానీ తనకు కావలసిన వివరాలు చెప్పలేదు, ఇంక తనకెలాంటి అపాయమూ లేదని తనతో వుంటే ఎటువంటి భయమూ వుండదని తనకి తోచాలి అందుకే చికాగోలో తను పనిచేస్తున్న కంపెనీ గురించి అమెరికాలో తన అనుభవాల గురించీ చెబుతూ ఆమెను కబుర్లలో పెట్టాడు క్రమంగా నీరజ ధోరణిలో మార్పు వచ్చింది -తని మాటలు ఎంతో ఉత్సాహంగా వింటూ కూర్చుంది. ఆ తరువాత వాళ్ళు ఎం బి ఎ చేసిన రోజులూ కాలేజీలో ఆమె చేసిన అల్లరీ అన్నీ గుర్తుచేసాడు. 'గుడ్ ఓల్డ్ డేస్' అంటూ నీరజ పూర్వంలా నవ్వడం చూసి రమణారావుకి కొండంత ధైర్యం వచ్చింది. అంతలో తలుపుతట్టి టిటిఇ లోపలికి వచ్చాడు. నీరజ టికెట్టు తాలూకు ఎక్సెస్ ఫేర్ తీసుకుని రసీదిచ్చి "ఝాన్సీలో చూద్దాంలెండి ఒక్కోసారి కాన్సిలేషన్స్ వుంటాయి" అంటూ వెళ్ళిపోయాడు.

"నిజంగా నువ్వు కనిపించావు కాబట్టి సరిపోయింది, లేకపోతే నాగతి ఏమయ్యేదో...." అంది నీరజ కొంచెం సీరియస్‌గా మొహం పెట్టి

"ఇంతకీ ఆ సుధీర్ ఎవరూ?"

"నీరజ వున్నట్టుండి టెన్స్ అయిపోయింది. కళ్ళల్లో భయం చోటు చేసుకుంది, "సుధీర్".... అదేదో చాలా భయంకరమైన పేరన్నట్టు పలికింది నీరజ. క్రమంగా సర్దుకుంటున్న నీరజను మళ్ళీ డిస్టర్బ్ చేసినందుకు తనను తాను తిట్టుకున్నాడు రమణారావు.

"నన్ను అతను వదిలి పెట్టడు .. నాకు తెలుసు అతను ఈ ట్రైన్‌లో వుండే వుంటాడు.... నన్ను వెంటాడూనే వుంటాడు."

"డోంట్ బీ సిల్లీ నీరజా- నేనుండగా నినెవ్వరూ ఏమీ చేయలేరు."

"నిజంగానా.... నువ్వు నన్ను ఆదుకుంటావా? ఆ సుధీర్ నా జోలికి రాకుండా చేస్తావా.... ప్లీజ్.... చెప్పు.. నాకోసం ఆమాత్రం చేయలేవా?...."

"నేను మాటిస్తున్నాను నీరజా నీ కోసం ఏదైనా చేస్తాను. నా సెలవు పొడిగించి హైద్రాబాద్‌లోనే వుంటి, నీ సమస్య ఎటువంటిదైనా, పరిష్కరించి మరీ వెళతాను....

అతని మాటలు నీరజ విన్నదో లేదో .... మళ్ళీ తన ధోరణిలోనే

"నో.... నన్నెవరూ రక్షించలేరు.... అతడు నన్ను వదిలి పెట్టడు" అంటూ బెర్తు చివరికి జరిగి, ముడుచుకుని మోకాళ్ల మీద తలపెట్టుకుని కూర్చుంది.

నీరజని దగ్గిరికి తీసుకుని ఓదార్చా లనీ, తన మనసులో ఆమెపట్ల వున్న ఆరాధన తెలియజేసి. ధైర్యం చెప్పా లనీ అనిపించింది రమణారావుకి. నీరజ పక్కనే కూర్చుని, భుజంమీద చెయ్యివేసి-నీరజా అని ఏదో చెప్ప బోయాడు.

'డోంట్ టచ్ మీ ఐ యామ్ డర్టీ' అన్న నీరజ అరుపు విని ఆమె భుజం మీదినుంచి చెయ్యి తీసేశాడు నీరజ అపాదమస్తకం వణికి పోతోంది.

"నన్ను ముట్టుకోకు.... నన్నెవ్వరూ ముట్టుకోకూడదు.... ఐవాస్ రేప్డ్"

"వ్వాట్...." రమణారావు బిగ్గరగా అరిచి, తలచేతుల్లో పట్టుకుని కూర్చుండి పోయాడు.... ఎంత దారుణం జరిగి పోయింది? తను ప్రేమించిన నీరజ ఒక దుర్మార్గుడి కామానికి బలి అయి పోయిందా?

....నీరజ నీ స్థితికి తెచ్చిన వాడెవ డైనా సరే- వెతికి పట్టుకుని, వాడి అంతు చూడాలి. నీరజకి జరిగిన అన్యా యానికి వాడ్ని ఏం చేసినా పాపంలేదు. రమణారావు మనసులోని బాధ ఆవే దనగా మారి, కక్షగా పరిణమించింది. అప్రయత్నంగా పిడికిలి బిగించి, బెర్తు మీద గుద్దాడు రమణారావు ఆతని మనస్సు పరి పరి విధాల ఆలోచిస్తోంది.

నీరజ మెల్లిగా చెప్పడం ప్రారంభించింది. "నాకు మొదటినుంచీ అతనంటే అసహ్యం. నాన్నగారి ఎదుట ఒకలాగా, పరోక్షంలో మరొక లాగా వుండేదతని ప్రవర్తన.... కానీ నాన్నగారికి వాడంటే ఎంతో గురి.... ఆరోజు నాన్నగారి సుస్తీ చేసినపుడు సుధీర్ కూడా ఇంట్లోనే వున్నాడు. అప్పుడే ఆయనకి స్లో పాయిజన్ చెయ్యడం మొదలు పెట్టాడు. రెండు నెలల్లో గానే నాన్నగారు పోయారు. ఆస్థి వ్యవహారాలన్నీ మొదట్నుంచీ చూస్తున్నాడు కనుక ఆ వివరాలన్నీ వాడికే తెలుసు.... ఆ వంకతో ఎస్టేట్ డ్యూటీ కాగితాలు పూర్తి చేయాలని రాత్రిళ్లు మా ఇంట్లోనే వుండి పోయేవాడు.... ఆరాత్రి.... పనివాళ్లం దర్నీ ఎక్కడికో పంపించేసి.... ....నన్ను ఒంటరిదాన్నిచేసి...." వెక్కి వెక్కి ఏడుస్తోంది నీరజ....

"ప్లీజ్.... ఇంకేం చెప్పకు...." రమణారావుకి చాలా వరకూ సంగతి అర్థమయింది. కానీ నీరజ ఢిల్లీకి ఎలా వచ్చిందో అర్థం కాలేదు ఆ సంగతే అడిగాడు.

"ఢిల్లీకా.... ఏమో గుర్తు లేదు.... ఆరోజు నుంచీ నేనతనికి బందీగానే వున్నాను. ఢిల్లీలో అతని అనుచరుల ఇంట్లోనే పడేశాడు ... నాకు తెలుసు.... అతను మళ్ళీ నన్ను పట్టుకుంటాడు.... నీకు నేనంటే అసహ్యం వేయడం లేదూ?"

"లేదు నీరజా ఇన్నాళ్ళూ నేను నీతో చెప్పని మాట ఇవాళ చెప్తున్నాను ఐ లవ్ యూ.... వాడి రక్తం కళ్ళ చూస్తాను. నీకు జరిగిన అన్యాయానికి ప్రతీకారం తీర్చుకుంటాను. నువ్వు నిశ్చింతగా వుండు మనం హైద్రాబాద్

వెళ్ళి, మీ బాబాయిని కలుసుకుని, చేయవలసిన పనేమిటో ఆలోచిద్దాం. నువ్వు కాస్సేపు పడుకో!

రమణారావు, నీరజ, సికింద్రాబాదు స్టేషన్లో దిగి టాక్సీలో నీరజ వాళ్ళ బాబాయి రామానుజం గారింటికి వెళ్లారు. మారేడుపల్లిలో ఆయనది పెద్ద బంగళా. కానీ, రామానుజం గారు సకుటుంబంగా బొంబాయి వెళ్ళారనీ, మరో మూడురోజులు దాకా రారనీ చెప్పాడు రామానుజంగారి తోటమాలి.

రామానుజంగారికి నీరజని అప్పజెప్పి ఆయనతో కలిసి సుధీర్ పని పట్టాలనుకున్న రమణారావుకి అంతా తారుమారైనట్టనిపించింది. రామానుజంగారింట్లో నీరజని ఒంటరిగా వదిలిపెట్టడం మంచిది కాదనిపించింది అతనికి. ఏం చేయాలా అని ఆలోచిస్తూ వెనక్కి వచ్చి టాక్సీలో కూర్చున్నాడు రమణారావు. టాక్సీ బయల్దేరిన తరువాత నెమ్మదిగా నీరజకి చెప్పాడు రామానుజంగారు ఊళ్ళో లేరనీ, ఆయన వచ్చేవరకూ హోటల్లో వుందామనీ....

హైద్రాబాద్ చేరుకున్నాక నీరజ ఎంతో రిలాక్స్ అయిందనిపించింది రమణారావుకి. మునుపటిలా సరదాగా కబుర్లు చెపుతోంది. హాయిగా నవ్వుతోంది. ఇలాగే ఆమెను మరో రెండు రోజులు జాగ్రత్తగా చూసుకుంటే చాలు. ఆ తరువాత వాళ్ళ బాబాయిగారు రాగానే ఒక ప్లాన్ ఆలోచించి, ఆ సుధీర్ పని పట్టాలి.

ఆ సాయంత్రం ధైర్యంచేసి రమణారావు నీరజని సినిమాకి తీసుకెళ్ళాడు. రూంకి వచ్చి భోంచేసారిద్దరూ. నీరజని డబుల్ బెడ్ మీద పడుకోమని చెప్పి, రమణారావు దిండు తీసుకుని కిటికీ పక్కనే వున్న దివాన్ మీద పడుకున్నాడు. కిటికీలోంచి ఎయిర్ పోర్టు కేసి చూస్తూ పడుకుంటే నిద్రపట్టేసింది. అలా ఎంతసేపు నిద్రపోయాడో అతనికే తెలియదు. మెలకువ వచ్చి చూస్తే, బెడ్ లైట్ వెలుతుర్లో, తన దివాన్ పక్కనే నీరజ నిలబడి వుంది.

'ఏమిటి నీరజా?' ఆదుర్దాగా అడిగాడు.

'భయంగా వుంది'

'పద నేను నీ పక్కనే కూర్చుంటాను. నువ్వు నిద్రపో' అంటూ భుజం చుట్టూ చెయ్యివేసి, నీరజని నడిపించుకుని వెళ్ళి బెడ్ మీద పడుకోబెట్టి, తను పక్కనే కూర్చున్నాడు.

'థాంక్యూ' అంటూ నీరజ అతని చేయి పట్టుకుని రెండు నిముషాల్లోనే నిద్రపోయింది. బెడ్ లైట్ మసక వెలుతుర్లో, నీరజ మొహం అస్పష్టంగా కనిపిస్తోందతనికి. అప్రయత్నంగా ముందుకు వంగి ఆమె పెదవుల మీద ముద్దెట్టుకున్నాడు. నీరజకు మెలకువ రాలేదు. అతను మళ్ళీ ముందుకు వంగి, నీరజని ముద్దెట్టుకున్నాడు. నీరజ ఊపిరి తన ఊపిరిలో కలుపుకుంటూ అలాగే, కాస్సేపు వుండిపోయాడు. నీరజ పూర్తిగా కోలుకున్న తరువాత, తన మనసులో మాట బయటపెట్టి ఆమెను

పెళ్ళాడాలనీ, తన ప్రేమతో నీరజ గతాన్ని మరపించాలనీ నిర్ణయించుకున్నాడు రమణారావు.

ఆ మర్నాడు నీరజ అదోలా వుంది హోటల్ రూంలో నాలుగు గోడలమధ్య ఆమెను బంధించినట్టు ఫీలవుతోందేమో ననుకుని, రమణారావు తన స్నేహితుడు ప్రకాశ్‌కి ఫోన్ చేసి అతని కారు తెప్పించుకున్నాడు. కారు తీసుకొచ్చిన డ్రైవర్‌ని, కారు వదిలిపెట్టి వెళ్లమనీ మళ్లీ సాయంత్రం వచ్చి కారు తీసికెళ్లమనీ చెప్పి పంపించేశాడు. బ్రేక్‌ఫాస్టు తీసుకునీ ఇద్దరూ కారులో బయలుదేరారు. కారు స్టార్ట్ చేశాడేకానీ, రమణారావుకి ఎటు వెళ్లాలో అర్థం కాలేదు. బిజీ రోడ్ల మీద వెడితే, నీరజని ఎరిగిన వారెవరైనా కనిపించవచ్చు - తను హైద్రాబాద్ వచ్చినట్టు, ప్రకాశ్‌కి తప్ప ఇంకెవరికీ ఇంతవరకూ తెలియదు. నీరజని వాళ్ల బాబాయి ఇంట్లో వదిలి పెట్టే వరకూ అలాగే వుండాలి-ఏదో ఆలోచిస్తూ, రమణరావు కారుని హైదరాబాద్ వైపు పోనిచ్చాడు-నీరజ కూడా ఏవో ఆలోచనల్లో మునిగిపోయినట్టు కిటికీలోంచి ఎటో చూస్తూ కూర్చుంది. రమణరావు ఆమెని పలకరించలేదు. కారుని నగరందాటి గొల్కొండ వైపు మళ్లించాడు. కాస్సేపు ఖుతుబ్‌షాహీ సమాధులదగ్గర కూర్చుంటే ప్రశాంతంగా ఉంటుందనిపించింది అతనికి.

"ఇక్కడ కాస్సేపు కూర్చుందామా?" కారాపి, తలుపు తెరుస్తూ అన్నాడు. యాంత్రికంగా అతని వెంట నడిచింది నీరజ. సమాధి దగ్గరికి వెళ్లడానికి ముందు కొంచెం ఇరుగ్గా వున్న మెట్లెక్కి పైకి వెళ్ళాలి, ఆ తరువాత విశాలమైన టెర్రెస్ వుంది. అక్కడ నిలబడితే, మనిషిని ముందుకు తోసేస్తూ, బలంగా గాలి వీస్తుంటుంది చీర కొంగు తలచుట్టూ కప్పుకుని, రమణరావు వెనకే వస్తోంది నీరజ. అక్కడి నుంచి కిందికి చూస్తే, రమణరావు పార్క్ చేసిన ఫియట్ కారు పక్కనే ఒకతను మోటర్ బైక్ ఆపడం చూశాడు రమణారావు. అదే క్షణంలో నీరజ కూడా అటుచూసింది. అంతే, 'అయ్యో' అని అరచి రమణారావు చేయి గట్టిగాపట్టుకుంది, ఆ పాదమస్తకం వణికిపోతూ సుధీర్ అంటూ ఆ వ్యక్తి వేపు చేయి చూపించింది.... సన్నగా పొడుగ్గావున్న ఆ ఆగంతకుడు నెమ్మదిగా మెట్లెక్కి పైకి వస్తున్నాడు.

ఇక రమణారావు ఆలోచించలేదు. నీరజ చేతిలోంచి తనచెయ్యి విడిపించుకుని టెర్రేస్‌మీదనుంచి కిందికి చూశాడు నెమ్మదిగా మెట్లెక్కి పైకివస్తున్న ఆ వ్యక్తి పైమెట్టుమీద కోపంగా నిలబడి వున్న రమణారావుకేసి ఆశ్చర్యంగా చూసాడు.

"ఒరేయ్ బాస్టర్డ్ .... ఇవాళతో నీ పనిసరి." అంటూ అతనికాలర్ పట్టుకుని బలంగా పైకి లాగాడు.

"ఎవరునువ్వు?ఏంకావాలి" అంటూ ఆవ్యక్తి రమణారావు చేతిలోంచి తన కోటు కాలర్ విడిపించుకోడానికి గుంజుకోసాగాడు రమణారావు బలం ముందు అతని ప్రయత్నం దేనికి పనికి రాలేదు. పైగా ఉద్రేకంతో రమణారావుకి ఏదీ తెలియడం లేదు. అతని కళ్లలోంచి ద్వేషం కురుస్తోంది.

"వదులు నన్ను.... ఏం కావాలి

నీకు...." అంటూ, మళ్ళీ అతను విడిపించుకోవాలని ప్రయత్నించాడు.

"వదిలి పెట్టకు ... వాడ్ని వదిలి పెట్టకు.... వాడే ... వాడే నా జీవితం నాశనం చేసింది." అంటూ నీరజ పైనుంచి అరుస్తోంది- పిడికిలి బిగించి బలంగా అతని డొక్కలో గుద్దాడు రమణారావు- ఆ దెబ్బకి దొర్లుకుంటూ వెళ్ళి, కింద పూలకుండీల దగ్గర పడ్డాడతను. లేవబోతున్న అతని మెడమీద బూటుకాలు పెట్టి బలంగా కిందికి నొక్కి పట్టాడు రమణారావు-

"చెప్పు.... నీరజని బలాత్కారం చేసినట్టు ఒప్పుకొంటావా లేదా? ఆమె తండ్రిని స్లోపాయిజన్ చేసి చంపావా లేదా?"

ఆవ్యక్తి ఏదో చెప్పాలని ప్రయత్నిస్తున్నాడు. కానీ మాట్లాడలేక, తన బలాన్నంతా ఉపయోగించి, రమణారావు మోకాలుమీద గట్టిగా గుద్దాడు. బాలెన్స్ తప్పిన రమణారావు కాలు జరిపేశాడు- ఆవ్యక్తి మెగపులా లేచి నిలబడి, పక్కనే వున్న పూలకుండీ తీసుకుని రమణారావు మీదికి విసిరాడు. రమణారావు వెనక్కి జరగబోతే, కాలు మెలికి తిరిగింది- ఇంతలో ఆ వ్యక్తి గబ గబా పరుగెత్తాడు- కానీ రమణారావు అంతలోనే సర్దుకుని, అతన్నిపట్టుకుని టెర్రేస్ పైకి లాక్కొచ్చాడు.

"ప్లీజ్! నన్ను వదిలేయ్! నాకేం తెలియదు. నేను మీరను కొంటున్న మనిషిని కాదు.... మీరు పొరబడుతున్నారు. ఐయామ్ డాక్టర్ చారి...." అంటూ ఆతను విడిపించుకోవాలని ప్రయత్నించాడు, రమణారావు ఆవేశంలో ఇవేమీ వినిపించుకోవడం లేదు.

"నిన్నెలా దారికి తీసుకు రావాలో నాకు తెల్సురా" అంటూగట్టిగా అతని మెడమీద ఒకగుద్దు గుద్దాడు అంతే.... ఆ మనిషి కుప్పలా కూలి పోయాడు. ఆతడు లేస్తాడని అనుకున్న రమణారావుకి, ఆవ్యక్తి ఎంతకీ కదలక పోయే సరికి ఏదో అనుమానం వచ్చింది. కిందకు వంగి, అతని భుజం పట్టి తనవైపు తిప్పుకున్నాడు అతని కళ్లు నిర్జీవంగా తననే చూస్తున్నట్టున్నాయి.

హత్య.... తను సుధీర్‌ని చంపేశాడు ఆవేశంలో తను కొట్టిన దెబ్బకి అతని మెడఎముక విరిగి పోయుండాలి.

చుట్టూ కలయ చూసాడు రమణారావు. ఈ గొడవ ఎవరూ చూళ్లేదన్నమాట.... నీరజ కోసం చూశాడు రమణారావు. మెట్లమీద కూర్చుని మొహం చేతులమధ్య పెట్టుకుని వెక్కి వెక్కి ఏడుస్తోంది. వెంటనే, ఇక్కడినుంచి బయట పడాలి ఈపని తను చేసినట్టు ఎవరికీ తెలిసే అవకాశం లేదు. చట్టం దృష్టిలో తను నేరస్థుడే అయినా తన మనసుకి తెలుసు, తెలిసీ తను చేసింది నేరం కాదు. సుధీర్ లాంటి పాపాత్ముల్ని చంపితే నేరం కాదు.... గబగబా నీరజ చేయిపట్టుకుని లాక్కొంటూ వెళ్ళి కార్లో కూర్చుని కారు రివర్స్ చేసుకుని బయల్దేరాడు రమణారావు. కాసేపట్లో ఎవరో ఒకరు ఆ శవాన్ని చూసి పోలీసులకి ఫోన్ చేస్తారు. కానీ పోలీసులకి తన సంగతి తెలిసే అవకాశం లేదు.

ఆరోజు సాయంత్రం నీరజ బాబాయి ఇంటికి ఫోన్ చేశాడు రమణారావు. ఆయన బొంబాయినుంచి వచ్చేసారని తెలిసి తనే స్వయంగా మారేడుపల్లికి

బయలుదేరాడు.

డ్రాయింగ్ రూంలో ఒంటరిగా కూర్చుని ఏవో ఎకౌంట్స్ చూస్తున్నారాయన తనను తాను పరిచయం చేసుకుని,

"మొన్న ఢిల్లీలో ట్రైన్ ఎక్కుతూంటే అనుకోకుండా నీరజ కనపడింది."

వ్వాట్? నీరజ కనబడిందా? మీతో మాట్లాడిందా? ఇప్పుడెక్కడుందో తెలుసా? అంటూ ఆతృతగా ముందుకు వంగి అడిగాడు

"కంగారు పడకండి- నీరజ సురక్షితంగా నాదగ్గర వుంది. నిన్న ఇద్దరం కలిసి ఇక్కడికి వస్తే మీరు ఊళ్ళో లేరని తెలిసింది. ఒంటరిగా ఇక్కడ వదిలిపెట్టి వెళ్ళడానికి మనస్కరించక నిక్కాన్ కాంటినెంటల్‌లో దింపాను."

"హమ్మయ్య ... మొన్న మా కజిన్ ట్రంకాల్ చేసి నీరజ కనిపించడంలేదని చెప్పినప్పటినుంచీ మా అందరి మతులు పోయినట్టయింది. అసలే నీరజ మానసిక పరిస్థితి బాగాలేదు. ఎక్కడికి వెళ్ళిపోయిందో ఏలావుందో అని పోలీస్ రిపోర్ట్ కూడా ఇచ్చాం. పదండి.... నేను వెంటనే నీరజని చూడాలి .... హోటల్‌కి వెళ్దాం." అంటూ ఆయన లేచి నిలబడ్డాడు. రమణారావుకి ఎక్కడో ఏదో పొరపాటు జరిగిందనిపించింది. కారులో సంభాషణ మొదలుపెట్టాడు రమణారావు.

"నీరజ చెప్పింది .... అదే ఆ సుధీర్ ఎలా హింసించాడో.. అవన్నీ"

"అవును.... ఆ దుర్మార్గుడివల్లే తన జీవితం ఇలా అయిపోయింది. పైగా .... వాళ్ళ నాన్నగారు కూడా సడన్‌గా పోవడంతో చాలా పెద్దషాక్ నీరజకి .... అందుకే కొంచెం వాతావరణం అదీ మారితే బావుంటుందని ఢిల్లీలో మా కజిన్ ఇంటికి పంపిచాను తనని" "మరి సుధీర్ .... "అంటూ అనుమానంగా ఏదో అడగబోయాడు రమణారావు.

"ఆ స్కౌండ్రల్ని అప్పుడే పోలీసులకి అప్పచెప్పాం. చేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్నాడు రాజమండ్రి జైల్లో

పాపం .... నీరజే .... ఇలా అయిపోయింది నెర్వస్ బ్రేక్ డవున్ వచ్చి"

రామానుజంగారు నిట్టూర్చి మళ్ళీ చెప్పడం మొదలెట్టారు.... "ఆ తర్వాత అది పర్సిక్యూషన్ మానియా అని చెప్పాడు సైకియాట్రిస్టు ఢిల్లీలోనే సైకోథెరపీ ఇప్పిస్తున్నాం. ఆ సుధీర్ ఇంకా తనని వెంటాడుతున్నాడని తనని ఏదో చేస్తాడని ఊహించుకుంటూ వుంటుంది ఎప్పుడూ. సుధీర్ జైల్లో వున్నాడని, తనకింకేం భయంలేదని ఎంతచెప్పినా వినిపించుకోదు. ఎవరైనా సన్నగా పొడుగ్గా వున్న వ్యక్తులు కనిపిస్తే చాలు అతడే సుధీర్ అని .... తనని నాశనం చేస్తాడని పిచ్చిగా అరుస్తుంది ...."

అంతే రమణారావుకి రామానుజంగారి మాటలు వినబడడం మానేసాయి.

"ప్లీజ్ నన్ను వదిలేయ్, నాకేం తెలియదు. నేను మీరనుకున్న మనిషిని కాదు. మీరు పొరబడుతున్నారు. ఐయామ్ డాక్టర్ చారి .... మీరు పొరబడుతున్నారు ఐయామ్ డాక్టర్ చారి ...." అన్న ఆక్రందనలే అతని చెవుల్లో ప్రతిధ్వనించ సాగాయి.

జ్యోతి